www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 20 మే 2025

5

తూర్పుగోదావరి

హౌస్ హోల్డ్ మ్యాపింగ్ తప్పనిసరి : కమిషనర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాష్ట్ర ప్రభుత్వ సేవలు పొందేందుకు ప్రతి పౌరుడు హౌస్ హోల్డ్ మ్యాపింగ్ తప్పని సరిగా చేయించుకోవాలని కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం సంక్షేమ పథకాల కోసమే కాకుండా.. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ట్యాక్స్ పేమెంట్, ల్యాండ్ రిజిస్ట్రేషన్లు వంటి సేవలు పొందాలంటే ఈ హౌస్ హోల్డ్ మ్యాపింగ్ తప్పనిసరి అన్నారు. కనుక [illegible] రేషన్ కార్డుదారులతో పాటు ఇతర కార్డుదారులు, ఆర్థికంగా ఉన్నత వర్గాల వారు కూడా మ్యాపింగ్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ సేవలు పొందడం ప్రతి పౌరుడి హక్కు అన్నారు. మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసుకోవడం ద్వారా ఈ హక్కును కాపాడుకోవాలన్నారు. ఆయా సచివాలయ కార్యాలయాలను సంప్రదించాలని పిలుపునిచ్చారు.

వేతన వేదన

- అర్ధాకలిలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు
- ఆందోళనల బాటలో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లో వివిధ విభాగాలలో 199 మంది కార్మికులు సేవలందిస్తున్నారు. వీరికి కనీస వేతనాలు కూడా ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. 2024 ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అనేక హామీలు గుప్పించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు ఏపి మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గడిచిన డిసెంబరులో సమ్మె చేపట్టారు. 10 రోజుల అనంతరం చర్చలకు పిలిచిన ఉన్నతాధికారులు నెల రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. కాని ఆచరణలో పరిష్కరించలేదు. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి ఆందోళన చేపట్టారు. తమ విధులను బహిష్కరించి రాజమండ్రి కార్పొరేషన్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రస్తుత ధరల పెరుగుదలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్లో 180 మంది, నిడదవోలు మున్సిపాలిటీలో 13 మంది, కొవ్వూరు మున్సిపాలిటీలో 6 మంది ఇంజినీరింగ్ వర్కర్లు పనిచేస్తున్నారు. వీరంతా కార్పొరేషన్, మున్సిపాలిటీలలో వీధిలైట్లు, తాగునీటి కుళాయిలు, పార్కుల్లో విధులు నిర్వహిస్తున్నారు. చెత్త ట్రాక్టర్లు, లారీలు నడిపే డ్రైవర్లుగానూ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫిట్టర్లుగానూ సేవలందిస్తున్నారు. 20 సంవత్సరాలు సర్వీసులు ఉన్న వారికి సైతం ప్రభుత్వం నెలకు రూ.15వేల నుంచి రూ.18వేలు మాత్రమే వేతనం చెల్లిస్తోంది. టెక్నికల్ వర్కర్లకు రూ.29,200, నాన్ టెక్నికల్ వర్కర్లకు రూ.24,500 చొప్పున జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. నగర పంచాయతీలు, పురపాలక సంఘాలు నగరపాలక సంస్థలో పని చేస్తున్న కార్మికులకు అక్కడి జీవన ప్రమాణాలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు. 15 సంవత్సరాల పైబడి పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని, విధి నిర్వహణలో మృతి చెందిన కార్మికులకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరుతున్నారు. సంక్షేమ పథకాలు హెచ్‌ఆర్ పాలసీలు అమలు చేయాలని, శరీరం సహకరించని వారికి దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వం తరుపున వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్యం/ అనారోగ్య శాతాన్నినిర్ణయించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరుతున్నారు.

అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగ కార్మికులు(ఫైల్)

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

గత 30 సంవత్సరాలుగా మున్సిపల్ కార్పొరేషన్లో తాగునీటి సరఫరా విభాగంలో విధులు నిర్వహిస్తున్నాను. నేటికీ వేతనం రూ.16వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. ఓ వైపు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పర్మినెంట్ చేసి ఉంటే కనీసం రూ.80 వేలు వేతనం వచ్చే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి.

- కె.ముకుందరావు, కార్మికుడు, రాజమహేంద్రవరం కార్పొరేషన్

15ఏళ్ల సర్వీసు ఉంటే పర్మినెంట్ చేయాలి

మున్సిపల్ కార్పొరేషన్లో 20 ఏళ్లుగా తాగునీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్నాను. నెలకు రూ.13,885 మాత్రమే వేతనం ఇస్తున్నారు. ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి. శాంతియుతంగా ఆందోళనలను చేస్తున్నాం. పాలకులు తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలి.

- బి. భవాని కుమార్, కార్మికుడు, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్

పోరాట యోధుడు సుందరయ్య

40వ వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పోరాట యోధుడు సుందరయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. పేపరుమిల్లు వద్దనున్న బిటిఆర్ భవన్‌లో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని నిర్వహించారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి సీనియర్ నాయకులు టిఎస్ ప్రకాష్, ఎస్ఎస్.మూర్తి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.పవన్ అధ్యక్షతన జరిగిన సభలో అరుణ్ మాట్లాడారు. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటానికి ప్రత్యక్ష సారథ్యం వహించిన సుందరయ్య భారతదేశ విముక్తి మార్గం చూపారన్నారు. సిద్ధాంతాన్ని ఆచరణతో మేళవించగలిగిన ఆయన శక్తి సామర్థ్యాలను గుర్తించిన సిపిఎం ప్రథమ ప్రధాన కార్యదర్శిగా సుందరయ్యను ఎన్నుకున్నదని తెలిపారు. భ్రష్టు పట్టిన నేటి రాజకీయ వ్యవస్థలో ఉన్నత విలువలు గల సుందరయ్య లాంటి వారి జీవితం అందరికీ ఆదర్శనీయ మన్నారు. సమాజం కోసం త్యాగం చేయడం, ప్రజల పట్ల నమ్రత, నమ్మకం, పోరాటాల పట్ల నిబద్ధత, మార్క్సిస్టు సిద్ధాంతం పట్ల అచంచల విశ్వాసం సుందరయ్య ప్రత్యేకతలని అరుణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు : దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్యకు పలువురు ఘనంగా నివాళులర్పించారు. సుందరయ్య 40వ వర్ధంతిని చాగల్లు సిపిఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం శాఖ కార్యదర్శి కెకె.దుర్గారావు మాట్లాడుతూ మహోన్నత వ్యక్తి పార్టీ కోసం సర్వం త్యాగం చేసి పిల్లల పుడితే స్వార్థం పెరుగుతుందని ఆశించిన మహోన్నత వ్యక్తి పార్లమెంటు కూడా సైకిల్ పై వెళ్లి అనేక ప్రజా సమస్యల పరిష్కరించిన మహోన్నత వ్యక్తి ఈ అమరవీరునికి ఆశయాలను సాధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. చాగల్లు ఆనంద్ నీకేతన్ (గాంధీ ఆశ్రమంలో) ఆయన సేవలు అందించారని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కే పోచమ్మ రైతు సంఘం నాయకులు కే బుద్ధుడు ఆశా నాయకులు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

నిడదవోలు : నూతన రాజకీయ సంస్కృతికి నిలువుటద్దం పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జువ్వల రాంబాబు అన్నారు. నిడదవోలు సిపిఎం టౌన్ శాఖ ఆధ్వర్యంలో సుందరయ్య 40వ వర్థంతి సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గంటి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాంబాబు మాట్లాడారు. రాజకీయాల్లో ఉన్నత విలువలు పాటించిన గొప్ప నాయకులు సుందరయ్య అన్నారు. ఆయన్ని నేటితరం నాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సుందరయ్య బాటలో పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో జి.డేనియల్, ఉస్మాన్. రసూల్, సత్యనారాయణ, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు

వర్ధంతి సభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్

నిడదవోలులో...

చాగల్లులో...

పల్లెల్లోనూ గంజాయి వాసన

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

ఇంత వరకూ పట్టణాలు, నగరాలకే పరిమితమైన గంజాయి... నేడు పల్లెలకూ విస్తరించింది. పల్లెల్లో నిర్మానుష ప్రదేశాలు గంజాయి బాబులకు అడ్డాగా మారాయి. మండలంలోని తాళ్లపాలెం, సింగవరం శివారు ప్రాంతమైన తాళ్లపాలెం రైల్వే వంతెన, తీరుగూడెం వెళ్లే రహదారిలో ఉన్న టిడ్కో ఇళ్ల సమీపంలో ఉన్న జగన్ కాలనీ వద్ద నిర్మానుష ప్రదేశాలే లక్ష్యంగా చేసుకుని కొంతమంది యువత గుంపులుగా గంజాయి సేవిస్తున్నారు. ఒక్కొక్కసారి రాత్రి వేళల్లో గంజాయి పొగ వాసన ఎక్కువగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. గంజాయి మత్తులో రోడ్డుపై వెళ్లే ప్రయాణికులతో గొడవలకు సైతం దిగుతున్నారు. పోలీసులు నిఘా పెట్టినప్పటికీ కొంతమంది వ్యక్తుల ద్వారా గంజాయి సరఫరా గుట్టుగా సాగుతందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవల కాలంలోనే గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అయినప్పటికీ యువతకు గంజాయి దొరకడంతో బానిసలుగా మారుతున్నారు. విద్యను మధ్యలోనే ఆపేసి అల్లరి చిల్లరగా తిరుగుతున్నారు. మరికొంత మంది గంజాయికి అలవాటు పడి చోరీలు వంటి నేరాలకు పాల్పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మానుష్య ప్రదేశాల్లో పోలీస్ పెట్రోలింగ్‌ను నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగంపై ఉక్కుపాదం మోపుతాం. నిర్మానుష్య ప్రాంతాల్లో మద్యం, గంజాయి సేవిస్తే పోలీసులు గుర్తించలేరని భావన తగదు. అవసరం అయితే డ్రోన్లతో నిఘా పెడతాం. అసాంఘిక కార్యకలాపాలకు పూర్తిగా చెక్ పెట్టేందుకు అధునాతన సాంకేతికను వాడుతున్నాం. గంజాయి, మత్తు పదార్థాల వాడకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. దీన్ని రూపుమాపేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. మారుమూల ప్రాంతాల్లో సైతం గంజాయి అమ్మకాలపై నిఘా ఉంచాం. గంజాయి నిర్మూలనకు ప్రజల సహకారం కూడా చాలా అవసరం. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం ఇస్తే తగిన చర్యలు తీసుకుంటాం. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

- పివిజి.తిలక్, సిఐ, నిడదవోలు

ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న బాబ్జి

కో-ఆప్షన్ సభ్యునిగా షేక్ బాబ్జి ఏకగ్రీవం

ప్రజాశక్తి-కడియం

కడియం మండలం పరిషత్ కో ఆప్షన్ సభ్యునిగా కడియపు సావరం గ్రామానికి చెందిన షేక్ బాబ్జి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో కొనసాగిన కోఆప్షన్ సభ్యులు షేక్ వల్లీ శ్రీనివాస్ ఇటీవల మృతి చెందడంతో ఏర్పడిన ఖాళీ స్థానానికి నోటిఫికేషన్ విడుదలైంది. కూటమి అభ్యర్థిగా జనసేన పార్టీకి చెందిన షేక్ బాబ్జిని ఎంపిక చేశారు. ఆయన సోమవారం ఉదయం నామినేషన్ దాఖలు చేశారు. పోటీ లేకపోవడంతో బాబ్జి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి గిరి, ఎంపిడిఒ కె.రమేష్ ప్రకటించారు. ఈ మేరకు ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బాబ్జిని పలువురు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

రాయితీపై దాణా పంపిణీ

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు సమిశ్రగూడెంలో సోమవారం సబ్సిడీపై దాణాను పంపిణీ చేశారు. కూటమి నాయకుల చేతుల మీదుగా వీటిని అందించారు. పాడి రైతుల జీవితాల్లో వెలుగు నింపడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో గోగిన శ్రీనివాస్, ఉప్పులూరి రామ్మోహన్‌రావు, మాజీ సర్పంచ్ ఎమ్‌డి. అక్రమ్, పశుసంవర్ధక శాఖ సహాయకులు సత్తిరాజు, పాడి రైతులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

చీకట్లలో బ్యారేజీ క్వార్టర్లు

- విద్యుత్ కోతలతో ఇబ్బందులు
- లో ఓల్టేజీ సమస్యలతో సతమతం
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరం గ్రామంలోని బ్యారేజీ క్వార్టర్లు అంధకారంలో కొట్టు మిట్టాడుతున్నాయి. అనధికార విద్యుత్ కోతలు, లోవోల్టేజీ సమస్యలతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఒకవేళ విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ లోవోల్టేజీ ఇబ్బందులు తీవ్రంగా ఉంటున్నాయి. రాత్రి వేళల్లో అసలు ఫ్యాన్లు కూడా తిరగని పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండల విపరీతంగా కాస్తున్న వేళ ప్రజలు అల్లాడుతున్నారు. ఈ సమయంలో విద్యుత్ కోతల కారణంగా ప్రజలు నిద్రకు దూరమవుతున్నారు. ఉక్కపోతకు తోడు దోమల బెడద ఎక్కువగా ఉండటంతో కంటిపై కునుకు ఉండట్లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 50 ఏళ్ల నాటి విద్యుత్ లైన్లే నేటికీ కొనసాగుతున్నాయి. వీటిని కనీసం మరమ్మతులు చేసిన దాఖాలు లేవు. పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు చెబుతున్నారు. గతంలో బ్యారేజీ క్వార్టర్లలో పూర్తిస్థాయిలో ఉద్యోగులు ఉండేవారు. ప్రస్తుతం కొంత మంది ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు కొన్ని క్వార్టర్లలో నివాసం ఉంటున్నారు. వీరు నెలవారీ డిడిల రూపంలో ప్రభుత్వానికి కరెండు, క్వార్టర్స్, నీటికి సంబంధించి అద్దెలు చెల్లిస్తున్నారు. గతంలో అందరూ ఉద్యోగులే కావడంతో క్వార్టర్ల నిర్వహణ, విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేవి. ప్రస్తుతం వీరు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే కరువవుతున్నారు.

విద్యుత్ లేక వీధిలోనే కూర్చొని భోజనం చేస్తున్న ఓ కుటుంబం

వేధిస్తున్న సిబ్బంది కొరత

బ్యారేజీ క్వార్టర్స్‌కు విద్యుత్ సరఫరా విభాగానికి సంబంధించి ఇఇ, ఎఇ, లైన్‌మేన్, వైర్‌మేన్, హెల్పర్ల వంటి ప్రత్యేక సిబ్బంది ఉండేవారు. ప్రస్తుతం ఈ విభాగంలో పనిచేసే వారందరూ రిటైర్ అయ్యారు. అప్పటి నుంచి పోస్టులను భర్తీ చేయలేదు. దీంతో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ప్రస్తుతం ఇక్కడ ఒకే ఒక లైన్‌మ్యాన్ ఉన్నారు. మరో ఇద్దరు హెల్పర్లు కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. దీంతో విద్యుత్ లైన్లపై పర్యవేక్షణ కొరవడింది. ఐదు దశాబ్దాల నాటి లైన్లు కావడంతో చిన్నపాటి వర్షానికే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. జంగిల్ క్లియరెన్స్ చేసిన దాఖలాలు కూడా లేవు. లైన్లపై చెట్ల కొమ్మలు పడిపోవడంతో లోవోల్టేజీ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ విద్యుత్ లైన్లకు సంబంధించి ఏ సమస్య వచ్చినా ఈ ముగ్గురే చేయాల్సిన పరిస్థితి. వారు వచ్చి సమస్యలను పరిష్కరించేవరకూ బతిమలాడుకోవాల్సి స్థితి నెలకొంది.

కార్యాలయాలకు మాత్రమే కొత్త ట్రాన్స్‌ఫార్మర్?

ఐదు దశాబ్దాల నాటి ట్రాన్స్‌ఫార్మర్ నుంచే వీరికి విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. గతంలో ఇరిగేషన్ కార్యాలయాలకు ఇదే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యేది. విద్యుత్ సమస్యల నేపథ్యంలో అధికారుల ఒత్తిళ్లతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వేశారు. దీంతో కార్యాలయాలకు, ఇఎన్‌సి బంగ్లాకు విద్యుత్ సక్రమంగానే ఉంటుంది. కాని బ్యారేజీ క్వార్టర్స్‌కు సంబంధించిన లైన్లను నూతన ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుసంధానం చేయలేదు. దీంతో నిత్యం విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. విశ్రాంత ఉద్యోగుల పట్ల చిన్నచూపో అధికారుల పట్ల ఉదాసీనతో తెలియదు గాని విద్యుత్ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అర్జీలకు ఎండార్స్‌మెంట్ తప్పని సరి : కలెక్టర్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

పిజిఆర్ఎస్‌లో ప్రజలు అందిస్తున్న అర్జీలకు ఎండార్స్‌మెంట్ తప్పక ఇవ్వాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, రెవెన్యూ అధికారి సీతారామమూర్తి, ఇతర అధికారులతో కలసి ఆమె అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జరిగిన ఆడిట్ నివేదిక ప్రకారం 50 శాతం మంది ఫిర్యాదుదార్లకు ఎండార్స్‌మెంట్ చేరడంలేదనే ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఇటువంటి ఫిర్యాదులు రాకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలని సూచించారు. ఫిర్యాదుల్లో రెవెన్యూ, సర్వే శాఖలకు చెందినవి అధికంగా ఉన్నాయని, తర్వాతి స్థానాల్లో పోలీస్, పంచాయతీరాజ్, పురపాలక శాఖలు ఉన్నాయన్నారు. అధికారులు క్షేత్రస్థాయి పర్యటన చేయాలని, తద్వారా ఫిర్యాదుపై సమగ్ర అవగాహన పొందొచ్చన్నారు. కొన్ని సమస్యలను ఎంపిడిఒ, తహశీల్దార్, ఎస్‌హెచ్‌ఒతో కూడిన మండల స్థాయి కమిటీకి నివేదిస్తున్నట్లు తెలిపారు. పరిష్కారం చూపలేని అంశాలకు కారణాలు తెలపాలన్నారు.అనంతరం వికలాంగులకు ఉపకరణాలను అందించారు.

శ్రీ రాజరాజేశ్వరి విద్యాలయలో విలువలతో కూడిన విద్య

వి.వెంకటరామారావు

ప్రజాశక్తి - చాగల్లు

ఉన్నత విలువలతో కూడిన విద్యను అందిస్తున్న పాఠశాల శ్రీ రాజరాజేశ్వరి విద్యాలయ అని వ్యవస్థాపకులు వల్లిపల్లి వెంకటరామారావు. పాఠశాలలో అందిస్తున్న బోధన, వసతులు, ఇతర కార్యక్రమాలపై ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. తమ పాఠశాలను 1977లో స్థాపించామన్నారు. నాణ్యమైన విద్యను అందించడంతో పాటూ సంస్కృతి సంప్రదాయాలను తెలియజేసేలా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల సహకారంతో 48 ఏళ్ల పాటు విద్యా సేవలో విజయ పదంలో దూసుకుపోతున్నామని తెలిపారు. విద్యార్థులను అన్ని రంగాల్లోనూ తీర్చుదిద్దుతున్నామన్నారు విద్యారంగంలో నైతిక విలువలను పాటిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. మొదట అద్దెభవనంలో పాఠశాలను ప్రారంభించి 1990లో సొంత భవనంలోకి మార్చామన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను కల్పించామన్నారు. విశాలమైన తరగతి గదుల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధన సాగిస్తున్నామని తెలిపారు. సాధారణ విద్యార్థులు సైతం అసాధారణ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దటమే తమ పాఠశాల లక్ష్యమన్నారు. తమ పాఠశాలలో చదివిన అనేక మంది విద్యార్థులు దేశ విదేశాల్లో ఇంజినీర్లుగా, డాక్టర్లుగా, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా, అధ్యాపకులుగా, సినిమా దర్శకులుగా స్థిరపడ్డారని తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరం పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించామని తెలిపారు.

పాఠశాల భవనం

సంప్రదాయదుస్తుల్లో విద్యార్థులు

:: పాఠశాల ప్రత్యేకతలు ::

1. విశాలమైన ప్రాంగణంతో కూడి సొంత భవనంలో విశాలమైన తరగతి గదుల్లో బోధన
2. పరిసర ప్రాంతాలకు బస్సు సౌకర్యం
3. లేబొరేటరీ సౌకర్యం, డిజిటల్ క్లాస్ రూమ్
4. మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా సురక్షితమైన తాగునీరు
5. నిరంతరం సిసి కెమెరాల పర్యవేక్షణ
6. నర్సరీ నుంచి పదోతరగతి వరకూ నిర్వహణ
7. అంకితభావం కలిగిన ఉపాధ్యాయులతో బోధన
8. మల్టీమీడియాతో కంప్యూటర్ బోధన
9. చిన్నారులకు ప్లేస్కూల్ మెథడ్‌లో బోధన
10. ప్రతి విద్యార్థిపైనా వ్యక్తిగత పర్యవేక్షణ
11. డైలీ, వీక్లీ టెస్టుల నిర్వహణ
12. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ
13. క్రీడలు, కరాటే, డ్యాన్స్, సంగీతంలో శిక్షణ

విద్యార్థులకు పాశ్చాత్య నృత్యరీతుల్లో శిక్షణ

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి భాష్యం స్కూల్, పల్లంట్ల ఎంపిపి స్కూల్ ప్రాంగణాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలకు హైదరాబాద్ నుంచి ఫిటెనెస్ మరియు జుంబాడాన్స్ ట్రైనర్ డాక్టర్ గుత్తా రమాదేవి ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు వివిధ పాశ్చాత్య నృత్యరీతుల్లో శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ప్రతి తల్లీ వ్యాయామానికి సమయం కేటాయించి తమకుటుంబ ఆరోగ్యానికి మార్గదర్శి కావాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలతో కలసి యోగా, నృత్యం వంటివి సాధన చేయడం ద్వారా కుటుంబ బాంధవ్యం పెంపొందుతుందన్నారు. పిల్లల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని తెలిపారు. భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ పి.పేరయ్యనాయుడు మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు బానిస కాకుండా వేసవి సెలవులు సద్వినియోగం చేసుకునేవిధంగా వేసవి శిక్షణ శిబిరాలు ఉపయోగపడ తాయన్నారు. ఈ కార్యక్రమంలో నలమాటి లలిత, ఆచంట నెహ్రూ, యు.కృష్ణారావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాయి ప్రాపర్టీస్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలంలోని ధూమంతునిగూడెంలో సాయి ప్రాపర్టీస్ అండ్ ప్రాజెక్ట్స్ ఎర్రచందనం ఫామ్ ల్యాండ్ కంపెనీ, జనసేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మదర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సిబ్బంది వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం నిర్వాహకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ఉచిత వైద్య శిబిరాన్ని తమ సంస్థ తరఫున ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్తులో మరిన్ని శిబిరాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సాయి ప్రాపర్టీస్ సీనియర్ డైరెక్టర్ కందూరి ఆనంద్, జనరల్ మేనేజర్ పినిశెట్టి పవన్, సేల్స్ మేనేజర్ ఆకుల వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ గోపాలపురం ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, కృష్ణం పాలెం పంచాయతీ ప్రెసిడెంట్ నాయుడు ప్రసాద్, దుమంతుని సుబ్బారావు పాల్గొన్నారు

'చలో విజయవాడ' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కడియం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర మూడవ కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన పోస్టర్‌న్ కడియం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం ఆవిష్కరించారు. విజయవాడలో వచ్చేనెల 5న జరిగే ఈ సమావేశానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.రవికుమామార్ కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వప్న, డాక్టర్ హేమశిరీష, డాక్టర్ టివి.శ్రీధర్, రాజమహేంద్రవరం రూరల్ అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ మోహన్‌వంశీ, డాక్టర్ ఇతిహాసన్, ఎ.రవికుమార్, బాపనమ్మ, నర్సింగ్, పారామెడికల్, సపోర్టింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దళిత విద్యార్థిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - నిడదవోలు

తిరుపతిలో దళిత విద్యార్థి జేమ్సను కిడ్నాప్ చేసి చిత్రహింసలు పెట్టిన దుండగులను కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ అమానవీయ ఘటనకు నిరసనగా కెవిపిఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దళిత విద్యార్థిని చిత్రహింసలు పెట్టడమే కాకుండా నోట్లో మూత్రం పోయడం దారుణమన్నారు. కులం పేరుతో అవమానించడం దుర్మార్గమన్నారు. ఈ చర్యలు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గండి శ్రీనివాసరావు, ప్రసాద్, సుబ్బారావు, మంగ రాజు, పోసి తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నాయకులు

నేరాలు ఘోరాలు

గోదావరిలో యువకుడు మృతి

ప్రజాశక్తి- కొవ్వూరు

సీతంపేట సమీపంలో విజ్జేశ్వరం ఆనకట్ట తొమ్మిదో గేటు వద్ద గోదావరిలో స్థానానికి దిగ్గి నిడదవోలుకు చెందిన గాడి రాకేష్(17) ప్రమాదవశాత్తూ మునిగిపోవడంతో మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ కె.శ్రీహరిరావు తెలిపిన వివరాల మేరకు కిరణ్‌కుమార్‌తో కలిసి రాకేష్ గోదావరి బ్యారేజీకి వెళ్లాడు. కొద్దిసేపు స్నానాలు చేసి ఫోటోలు దిగారు. ఆకస్మికంగా రాకేష్ నీటిలో మునిగి గల్లంతయ్యారు. దీంతో స్థానికులు రాకేష్‌ను వెలికి తీశారు. కొన ఊపిరితో ఉన్న అతన్ని నిడదవోలు ఆసుపత్రికి తరలించారు. వైద్యుల పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మతుని చిన్నాన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఆర్‌టిసి బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొత్తపేట

ఆర్‌టిసి బస్సు ఢీ కొట్టిన సంఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండల పరిధిలోని వాడపాలెం గ్రామానికి చెందిన గంధం నాగేశ్వరరావు(37) ఆదివారం రాత్రి కొత్తపేటలో శివాలయంలో బంధువుల వివాహం నిమిత్తం వెళ్లి తిరిగి వస్తుండగా బస్టాండ్ వద్ద అమలాపురం నుంచి రావులపాలెం వైపు వెళుతున్న ఆర్‌టిసి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు.

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మండలంలోని నంగవరంలో ఆదివారం అర్ధరాత్రి రైతు శీలం సత్యనారాయణకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. సుమారు 6 ఎకరాల గడ్డివాముకు అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని రైతు సత్యనారాయణ సోమవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. మంటలను ముమ్మిడివరం అగ్నిమాపక సిబ్బంది సుమారు మూడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు.

భర్తపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని వాడపల్లి గ్రామానికి చెందిన పెద్దింటి అనురాధకు అదే గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యంతో 17 సంవత్సరాల క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు అమ్మాయిలు జన్మించారు. ఇటీవల కాలంలో సుబ్రమణ్యం భార్య అనురాధను పుట్టింటి నుంచి అదనపు కట్నం తేవాలంటూ రోజు మానసికంగా, శారీరకంగా వేధించడంతోపాటు అనురాధను ఇంటి నుండి బయటకు నెట్టేశాడు. సహనం కోల్పోయిన ఆమె సోమవారం స్థానిక స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రామ తెలిపారు.

బైకు చోరీ

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

ఉప్పాడలో పాత్రికేయుని బైకు సోమవారం తెల్లవారుజామున చోరీకి గురైంది. ఉప్పాడలో ఆదివారం రాత్రి తోట శాంతి బైకు పార్క్ చేసిన వివాహ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వచ్చి చూడగా బైకు చోరీకి గురైనట్టు గుర్తించారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

వ్యభిచార గృహం గుట్టు రట్టు

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి గ్రామంలో వ్యభిచార గృహం గుట్టును పోలీసులు రట్టు చేశారు. ముందస్తు సమాచారంతో సోమవారం ఉదయం సుమారు 11 గంటలకు గ్రామంలోని మారుతీ నగర్‌లోని ఒక ఇంట్లో సిఐ నాగేశ్వరనాయక్, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది కలిసి దాడులు నిర్వహించారు. నిర్వాహకులను, ఇద్దరు మహిళలు, ఒక విటుడును అరెస్టు చేశారు. గోపాలపురం మండలం చిట్యాల గ్రామానికి చెందిన జుట్టా బేబి, దుద్దుకూరు గ్రామానికి చెందిన సిర్రా రవి కలిసి మారుతీ నగర్‌లో ఒక ఇల్లు అద్దెకు తీసుకొన్నారు. మహిళలకు వల వేసి వారిని ఆ ఇంటికి రప్పించి వ్యభిచారం చేయిస్తూ సొమ్ములు చేసుకుంటున్నారని సిఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామని బాధిత మహిళలను ఎపి స్టేట్ హోమ్‌కు తరలిస్తామన్నారు.

పేదలకు ఆహారం వడ్డిస్తున్న నవీన్

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. జగ్గంపేట గ్రామానికి చెందిన కొయ్యన రోహిత్ ఆర్థిక సాయంతో నిర్వహించిన ఈ అన్న క్యాంటీన్‌ను టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ప్రారంభించి పేదలకు ఆహారం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, టిడిపి నాయకులు బద్ది సురేష్, దాపర్తి సీతారామయ్య, దేగల సత్యనారాయణ, మరిశెట్టి గంగ, ఎండి కాజా, కొయ్యన అప్పయమ్మ, కొయ్యన జయ సూర్యనారాయణ, అల్లు సతీష్, అల్లు స్వర్ణ దుర్గ, అల్లు హేత్రిక, ఈగల సత్యవతి పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌లో నాలుగు ఫిర్యాదులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సమస్యల పరిష్కారం కోరుతూ నాలుగు అర్జీలు అందాయని ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ మాధవరావు తెలిపారు. భూమికి సంబంధించిన సమస్యలపై 3, బోర్‌వెల్‌కు సంబంధించి ఒక అర్జీ వచ్చాయన్నారు. ఈ అర్జీలను సంబంధిత కార్యాలయాలకు పంపించి నిర్ణీత సమయంలో పరిష్కరించి అర్జీదారులకు తెలియ జేయాలని ఆదేశించామన్నారు.

మాదిగలకు సముచిత స్థానం

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ

ప్రజాశక్తి -కొవ్వూరు

ఎస్‌సి కమిషన్ చైర్మన్ పదవిని తొలిసారి మాదిగలకు కేటాయించి సముచిత స్థానం కల్పించడం హర్షణీయమని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ అన్నారు. సోమవారం కొవ్వూరులో మాజీ మంత్రి, ఎస్‌సి కమిషన్ చైర్మన్ కెఎస్.జవహర్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దళితుల్లో 59 కులాలు ఉన్నప్పటికీ ప్రధానంగా రెండు కులాల్లో ఒక కులానికి మాత్రమే అవకాశం దక్కుతుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదలుకొని, ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన వారంతా తమ సోదర సామాజిక వర్గానికి చెందిన వారేనన్నారు. తొలిసారి మాదిగలకు సముచిత స్థానం కల్పించడం హర్షించదగ్గ విషయమన్నారు. దళితులపై నేటికీ దాడులు కొనసాగుతూనే ఉన్నాయని, ఎస్‌సి కమిషన్ వాటిని నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌సి కమిషన్‌కు ఇప్పటి వరకూ ఒకే సామాజిక వర్గానికి చెందిన నాయకులనే చైర్మన్లుగా నియమించారన్నారు. తమ జాతి బిడ్డల ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి ఎస్‌సి చైర్మన్ పదవిని మాదిగలకు కేటాయిస్తామని చెప్పారన్నారు. నేడు దీన్ని నిజం చేశారన్నారు. జవహర్ మాట్లాడుతూ వర్గీకరణ పోరాటంలో కృష్ణ మాదిగ చేసిన కషి మరువలేనిన్నారు. తాను పదవులను ఏనాడూ కోరుకోలేదని, జాతి అభ్యున్నతి కోసం పాటుపడ్డానన్నారు.

జవహర్‌తో మంద కృష్ణ తదితరులు

మందకృష్ణ సూచనల మేరకు చర్మకారులకు, డప్పు కళాకారులు, కులవృత్తి చేసుకునే వారికి గతంలో టిడిపి సర్కారు పింఛన్లు మంజూరు చేసిందన్నారు. నేడు దీన్ని కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసి మాజీ చైర్మన్ బూరుగుపల్లి వీరరాఘవులు, మాజీ ఎంపిపి వేగి చిన్న, ఎంఆర్‌పిఎస్ నాయకులు ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు, బి.రాజేశ్వరరావు, పి.సుభాష్ చంద్రబోస్, టిడిపి యువజన విభాగం నాయకుడు కె.ఆశిష్‌లాల్, టి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా అర్జీలకు పరిష్కారం : కమిషనర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు గడువులోగా సంతృప్తి స్థాయిలో పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. మొత్తం 27 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూకి సంబంధించి మూడు, టౌన్ ప్లానింగ్‌కి సంబంధించి ఐదు, ఇంజనీరింగ్‌కి సంబంధించి తొమ్మిది, వార్డు సచివాలయాలకు సంబంధించి ఎనిమిది, పబ్లిక్ హెల్త్‌కి సంబంధించి ఒకటి, మెప్మాకు సంబంధించి ఒకటి ఉన్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కనుక అర్జీలకు ప్రణాళికబద్ధంగా సంబంధిత అధికారులు పరిష్కారం చూపాలన్నారు. క్షేత్ర స్థాయిలో స్వయంగా పర్యటించి పారదర్శకంగా విచారణ జరిపి అర్జీదారుడు సంతృప్తి చెందేలా చూడాలన్నారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు జీరో స్థాయికి తీసుకురావాలని సూచించారు. సమర్పించిన అర్జీ పరిష్కారం కాలేదనే ఫిర్యాదు ఎక్కడా రాకూడదన్నారు. ప్రజల నుంచి స్వీకరించే ప్రతీ అర్జీకి సరైన ఎండార్స్‌మెంట్ ఉండాలన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

పంటలకు గిట్టుబాటు ధర కోసం ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మెయిన్ రోడ్డు వెంకటేశ్వర స్వామి గుడి సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌సిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నాయన్నారు. రైతులు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పంటలు పండిస్తే ఆ పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారన్నారు. ఈ ధర్నాలో వల్లూరి రాజబాబు, టి.సురేష్, పి.సతీష్, రెడ్డి దుర్గాదేవి, కోట వీరబాబు, సుంకర శ్రీను, పి.శ్రీను, బాబూరావు, పిల్లి దుర్గాప్రసాద్, కోట ఈశ్వరరావు, కొట్టేటి ప్రసాద్ పాల్గొన్నారు.

పెద్దాపురంలో ధర్నా చేస్తున్న రైతు కూలీలు

హసన్‌బాదను గ్రేడ్-2 పంచాయతీగా పరిగణించేలా చర్యలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని హసన్‌బాధ గ్రామాన్ని గ్రేడ్ 2 పంచాయితీగా పరిగణించాలని సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు కోరారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్‌కు సర్పంచ్ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల పునర్విభజనలో హసన్ భాద గ్రామాన్ని గ్రేడ్-2 పంచాయతీలో జనాభా ప్రాతిపదికన అప్‌గ్రేడ్‌కు కేవలం 13 మంది తక్కువగా ఉందని, 2011 జనాభా లెక్కల ప్రకారం తక్కువ ఉందని ప్రస్తుతం లెక్కల ప్రకారం 2000పైగా జనాభా ఉందని వివరించారు.

సర్వారాయుడు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లులోని వైసిపి నాయకుడు గవర సర్వారాయుడు కుటుంబాన్ని వైసిపి నాయకులు సోమవారం పరామర్శించారు. సర్వారాయుడు ఇటీవల గుండెపోటుతో మరణించారు. దీంతో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ తలారి వెంకట్రావు, నాయకులు తోట రామకృష్ణ, జె.ఏడుకొండలు, పిండి మంగరాజు, గెడ శ్యామ్, తాలూరి దామోదరం తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు. సర్వానాయుడు కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటదని హామీ ఇచ్చారు. మాజీ శాసనసభ్యులు కొవ్వూరు నియోజకవర్గం వైఎస్ఆర్ పార్టీ కన్వీనర్ తలారి వెంకట్రావు అన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలకు 746 మంది హాజరు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు 746 మంది హాజరయ్యారు. సోమవారం తెలుగు, సంస్కృతం పేపర్ -1 పరీక్షలు నిర్వహించారు. జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి ఆరు పరీక్ష కేంద్రాలను, తనిఖీ అధికారులు 16 పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు చేశారు. మొత్తం 1,226 విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 746 మంది హాజరయ్యారు. జిల్లాలో 28 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. ఓపెన్ స్కూల్ పదవ తరగతి అడ్వాన్సు సప్లిమెంటరీలో భాగంగా హిందీ పరీక్ష జరిగింది. మొత్తం ఇద్దరు విద్యార్థులు పరీక్ష రాశారు. అలాగే ఇంటర్‌కు సంబంధించి ఇంగ్లీషు పరీక్ష నిర్వహించారు. 350 మంది విద్యార్థులకు 282 మంది హాజరయ్యారు. అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు.

పోలీసు పిజిఆర్ఎస్‌కు 40 అర్జీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు 40 అర్జీలు అందాయని ఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్జీలకు నాణ్యతతో పాటు నిర్దేశించిన సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అర్జీలను పరిశీలించి నాణ్యతతో చట్ట పరిధిలో వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి(లాఅండ్ ఆర్డర్) ఎవి.సుబ్బరాజు, అడిషనల్ ఎస్‌పి(క్రైమ్స్) ఎల్.అర్జున్, డిఎస్‌పి(ఎస్‌బి) బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

మత్స్యకార వృద్ధులకు పింఛన్ల మంజూరు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గ పరిధిలో వృద్ధులైన మత్స్యకారులు 278 మందికి నూతనంగా వృద్ధాప్య పింఛన్లు మంజూరయినట్టు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మంజూరైన పింఛన్లకు సంబంధించి దవపత్రాలను ఈ నెల 21న అందజేయనున్నట్లు తెలిపారు. మత్స్యకారులకు కొత్తగా పింఛన్లు గూర్చి తాను పుదుచ్చేరి ప్రభుత్వ మత్స్యశాఖ ఉన్నతాధికారుల దృష్టికి అనేక సార్లు తీసుకువెళ్లి మంజూరు చేయించినట్లు తెలిపారు.

సివిల్స్ కోచింగ్‌కు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ఆది ద్రావిడార్ అండ్ షెడ్యూల్డు ట్రైబ్స్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (పిఎడిఎస్టిడిసి) ఆధ్వర్యంలో ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు సివిల్ సర్వీసెస్-2026 పరీక్షకు ఉచిత కోచింగ్‌కు సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరికి చెందిన ఎస్‌సి, ఎస్‌టిలై ఉండాలని, 35 ఏళ్లకు మించకుండా, ఎస్ఎస్‌సి ఉన్నతవిద్యను పుదుచ్చేరిలో అభ్యసించిన వారై ఉండాలని సూచించారు. అభ్యర్థులకు ప్రవేశ పరీక్షలు నిర్వహించి అందులో వచ్చిన మార్కుల ఆధారంగా ఉచిత కోచింగ్‌కు ఎంపిక ఉంటుందన్నారు. దరఖాస్తులను 'పివై.జిఒవి.ఇన్' వెబ్‌సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకొని పూర్తి చేసి యానాం పాడ్కో ఆఫీసులో అందజేయాలని కోరారు.

వైసిపి కార్యకర్తలందరికీ సముచిత స్థానం

ప్రజాశక్తి-పిఠాపురం

వైసిపిలో కష్టపడి పని చేస్తున్న ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామని పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వంగా గీత అన్నారు. నియోజకవర్గంలో అన్ని అనుబంధ విభాగ కమిటీల్లో పార్టీ కోసం కష్ట పడ్డ కార్యకర్తలకు పెద్దపీట వేసినట్టు తెలిపారు. పార్టీ ఎప్పుడూ ప్రజలకు చేరువగా ఉండే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నామని, కార్యకర్తలకు అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వైసిపి కార్యకర్తలపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు.

నేడు రక్తదాన శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

తలసేమియా చిన్నారుల కోసం రక్త దాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేయనున్నట్లు తహశీల్దారు జి.చిన్నారావు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు సురక్ష ప్యాలెస్‌లో నిర్వహించే రక్తదాన శిబిరానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ఇతర దాతలు పాల్గొని రక్తదానం చేయాల్సిందిగా కోరారు. రక్తదానం చేసేవారు ముందుగా తహశీల్దారు 9154247464, ఎంపిడిఒ 9441013090 నెంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని తెలిపారు.

మాదిగ కార్పొరేషన్ ద్వారా లబ్ధి

ప్రజాశక్తి - సామర్లకోట

మాదిగ కార్పొరేషన్ ద్వారా ప్రజలకు లబ్ధి చేకూర్చేందుకు తనవంతు కృషి చేస్తానని కార్పొరేషన్ డైరెక్టర్ వల్లూరి రాజా అన్నారు. సోమవారం సామర్లకోటలో మాదిగ ఆత్మగౌరవ రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు వల్లూరి నాని మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజా మాట్లాడుతూ తనకు ఈ పదవిని ఇచ్చేందుకు కృషి చేసిన కాకినాడ రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు రాజా కృతజ్ఞతలు తెలిపారు.

అన్న క్యాంటీన్ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - కొత్తపేట

కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డులో రూ.50 లక్షల అంచనా విలువతో నిర్మించనున్న అన్న క్యాంటీన్‌కు ఎంఎల్ఎ బండారు సత్యానంద రావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్ల ద్వారా పేద ప్రజలకు ప్రభుత్వం భోజనం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాసరావు, బూసి భాస్కరరావు, ధర్నాల రామకృష్ణ, ముత్యాల బాబ్జి, రెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బుర్రకథ ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - రామచంద్రపురం

హెచ్ఐవి, ఎయిడ్స్‌పై ప్రజలకు అవగా హన కల్పించేందుకు బుర్రకథ కళాకారులు సోమవారం రామచంద్రపురం మండలం లోని తోటపేటలో వీధి నాటకం ప్రదర్శించారు. కళాజాతాలతో ప్రజలను చైతన్యం చేసేందుకు వీధి నాటకాలు ఎంతో ఉపయోగపడతాయని బుర్రకథ కళాకారుడు వేమవరపు రాంబాబు తెలిపారు. వీధి నాటకంలో హెచ్ఐవి వ్యాధి ఎలా వ్యాపిస్తుంది? ఎయిడ్స్ కంట్రోల్‌కు తీసుకోవలసిన జాగ్రత్తలు, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంగాజి, కార్యదర్శి మణికంఠ, ఎఎన్ఎం సుబ్బలక్ష్మి, ఆశ వర్కర్ సుభాషిని, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెంకన్నకు బంగారు పంచ పాత్రలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామికి సోమవారం కొత్తపేటకు చెందిన మంతెన వెంకట సూర్యసుబ్బరాజు, కుటుంబ సభ్యులు 209 గ్రాముల ఐదు బంగారు పంచపాత్రలు, 318 గ్రాముల వెండి కంచం ఆలయ డిసి నల్లం సూర్య చక్రధరరావుకు అందజేశారు. వీరికి ముందుగా ఆలయ అధికారులు అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని అంగర 33/11 కె.వి సబ్ స్టేషన్‌లో కొత్త బ్రేకర్లు ఏర్పాటు చేసేందుకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ కె.రత్నాలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్ పరిధిలోని కపిలేశ్వరపురం, అంగర, టేకి, మాచర మట్లలు, శ్రీరామపురం, వెదురుమూడి, పడమరఖండ్రిక, కాలేరు, సుభద్రాపురం, నల్లూరు, నేలటూరు, వల్లూరు గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, కావున వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ముఖ ద్వారానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆత్రేయపురం

రావులపాలెం నుంచి బొబ్బర్లంక వెళ్లే రోడ్డులో సోమవారం వాడపల్లి వేంకటేశ్వర స్వామి ముఖ ద్వారం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. దాతలు సిఎంఆర్ షాపింగ్ మాల్స్ అధినేత మావూరి వెంకటరమణ దంపతులు, ఆలయ డిప్యూటీ కమిషనర్ కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు శంకుస్థాపన చేశారు

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి బాల బాలాజీ దేవస్థానంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఏలూరుకు చెందిన రంబా చంద్రశేఖర్, రమ్య దంపతులు సోమవారం రూ.10,116 విరాళాన్ని అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వాదం అందజేసి స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

ఉప్పునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

పంట పొలాలను నాశనం చేస్తున్న ఉప్పునీటి సమస్యను పరిష్కరించాలని మండలంలోని పేరూరు గ్రామానికి చెందిన పలువురు రైతులు కోరారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో రైతులు ఉప్పు నీటి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామ ఆయకట్టుకు సంబంధించిన కుమ్మరి కాలువకు ఉన్న లాకులు మరమ్మతులకు గురికావడంతో ఖరీఫ్, రబీ సమయంలో వరిచేలను ఉప్పు నీరు తాకుతుందన్నారు. సుమారు 100 ఎకరాల వరిచేలు ఉప్పు నీరు ముంపుతో నాశనం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కుమ్మరి కాలువ లాకులకు తక్షణమే మరమ్మతులు చేయించాలని, కుమ్మరి కాలువ, మేక కాలువ వంతెన నుంచి గంట వారి తూము వరకు మురుగు కాలువలోని గుర్రపు డెక్కను తొలగించాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ అధ్యక్షులు, పేరూరు పంచాయతీ వార్డు సభ్యులు దేగల వెంకటరమణ, దూనబోయిన గణేశ్వరరావు, జల్లి శ్రీను, రైతులు వెంకటరమణ, నరేంద్ల సత్యనారాయణ, దూనబోయిన ఫణేంద్ర, అడప బంగారయ్య, జల్లి సత్యం, జల్లి నాగేశ్వరరావు, కడలి వెంకటరావు, చింతపల్లి బేతాళ స్వామి, ముత్తబత్తుల రాజు పాల్గొన్నారు. .

ఐదు రోజుల యోగా శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - అమలాపురం

అంతర్జాతీయ యోగా డే సందర్భంగా ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు మండల, గ్రామ, వార్డు స్థాయిల్లో ఐదు రోజుల పాటు యోగ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కె.విజయానంద్, ఇతర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ విధి విధానాలు, అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని నెలరోజులపాటు యోగా కార్యక్రమాల నిర్వహణ, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్, దీపం-2 సబ్సిడీ రాయితీలు చెల్లింపు అంశాలపై ప్రజా సంతృప్తి స్థాయిలు, మరుగుదొడ్ల నిర్మాణం వంటి అంశాలపై సమీక్షించారు.

అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు

-వేసవికి చెక్ పెట్టిన వానలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మే నెలలో విపరీతంగా కాస్తున్న ఎండలకు ప్రస్తుతం కురుస్తున్న అల్పపీడన వర్షాలు వేసవి తాపానికి చెక్ పెట్టాయి. వేసవిలో ఏర్పడుతున్న అల్పపీడనం తోడు నైరుతీ రుతుపవనాలు ప్రవేశిస్తున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది. గత వారంలో శుక్ర, శనివారం, ఆదివారం వరకు కాస్త తెరిపిచ్చినప్పటికీ సోమవారం ఉదయం నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. 36 నుంచి 38 డిగ్రీలు నమోదవుతున్న ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి 28 డిగ్రీలకు చేరుకున్నాయి. మరో నాలుగు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో చల్లబడిన వాతావరణంతో సామాన్యులు ముఖ్యంగా వృద్ధులు, పసిపిల్లలు సేద తీరారు. మరోవైపు భారీ వర్షాలతో దాళ్వా ధాన్యాన్ని ఎగుమతులు చేసుకునేందుకు రైతులు అగచాట్లు పడుతున్నారు. పంట పొలాల నుంచి ధాన్యాన్ని బయటకు తీసుకువచ్చి వాహనాలపై ఎగుమతి చేయడం అకాల వర్షాలతో ఆటంకం ఏర్పడింది. ఇప్పటికే పంట పొలాల్లో సుమారు 50 శాతం ధాన్యం అమ్మకానికి సిద్ధంగా ఉంది. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎగుమతులకు అంతరాయం ఏర్పడడంతో పాటు ధాన్యం తడిసిపోయి రైతులు ఇక్కట్లకు గురవుతున్నారు. సోమవారం కురిసిన భారీ వర్షానికి ఎగుమతులు కూడా ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మొత్తం మీద భారీ వర్షాలతో మారిన వాతావరణం ప్రజలకు సేదతీరుస్తుండగా, రైతులకు పంట అమ్ముకునేందుకు వీలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు.

ఎస్‌సిలు అధికంగా ఉండే గ్రామాలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - అమలాపురం

ఎస్‌సిలు 50 శాతం పైబడి ఉన్న గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అధికారులు దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఎంపిడిఒలతో ఆన్‌లైన్ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడారు. పిఎం ఆదర్శ గ్రామ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని అన్నారు. షెడ్యూ ల్డ్ కులాల జనాభా 50 శాతం ఎక్కువ కంటే ఉన్న గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేయడమే ఈ పథకం లక్ష్యమని అన్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో అన్ని వర్గాల ప్రజల కనీస అవసరాలు పూర్తిగా తీర్చేందుకు ఈ పథకం దోహదం చేస్తుందన్నారు. సంస్థాగత మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతోపాటుగా సామాజిక ఆర్థిక అసమానతలను తగ్గించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సమన్వయం చేయడం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. భారత్ నిర్మాణ్, పిఎం గ్రామ్ సడక్ యోజన, సర్వ శిక్షా అభియాన్, గ్రామీణ ఉపాధి హామీ చట్టం వంటి పథకాలను ఈ గ్రామాల్లో సమర్థవంతంగా అమలు చేస్తారన్నారు షెడ్యూల్డ్ కులాల జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాలను కోనసీమ జిల్లాలో 55 గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 34 గ్రామాల కార్యాచరణ ప్రణాళికలు ఎంపిడిఒలు సమర్పించారని, మిగిలిన గ్రామాల అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం, రవాణా, విద్యుత్, గృహ నిర్మాణం వంటి ప్రాథమిక సదుపాయాలను మెరుగుపరచడంపై దృష్టి పెట్టాలన్నారు. సామాజిక భద్రత, జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక చేరిక డిజిటలైజేషన్ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్రామాల్లోని ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, సామాజిక సమానత్వాన్ని సాధించడానికి ఈ పథకం ఉపకరిస్తుందని ఆయన వివరించారు.

టి.సి.పోయినది

తూర్పుగోదావరి జిల్లా, నిడదవోలు మండలం, తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన **మల్లిపూడి సుశీల, తండ్రి: దుర్గారావు** ఇంటర్మీడియట్ టి.సి.పోయినది. దొరికినవారు ఇచ్చినచో తగిన బహుమతి ఇవ్వబడును. సెల్: 77022 74929

కైకరపు సత్యనారాయణ
అడ్వకేట్, సుబ్బరాజుపేట,
నిడదవోలు, సెల్:98481 75289

డాక్యుమెంట్లు పడిపోయినవి

తూర్పుగోదావరి జిల్లా, గోకవరం మండలం, గోకవరం గ్రామానికి చెందిన అట్లా వెంకటలక్ష్మి W/o. అట్లా వెంకటేశ్వరరావు (వెంకటరావు), S/o. గోవిందు, 3-48 వాసుదేవా వీధి, గోకవరం గ్రామం, మండలం. మా ఇంటి దగ్గర నుండి గోకవరం సెంటర్‌కి జిరాక్స్ నిమిత్తం వస్తుండగా మార్గ మధ్యలో పడిపోయాయి. డాక్యుమెంట్ నెంబర్ 917/1987 పడిపోయినవి. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది నెంబరు తెలుపగలరు.

ఫోన్: 846504 0746

పాస్‌పోర్టు పోయినది

కాకినాడ జిల్లా, సామర్లకోట మండలం, వేట్లపాలెం, హరిజనపేట, గూడపర్తి గ్రామము, డోర్ నెం. 21-97 నివాసి అయిన ఏలేటి దుర్గా భవాని అను నేను వేట్లపాలెం నుండి సామర్లకోట వస్తుండగా రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ది. 09-05-2025వ తేదీన మార్గ మధ్యలో నా పాస్‌పోర్టు పోయినది. నా పాస్‌పోర్టు నెంబర్ **డబ్ల్యూ 2907400.** కావున ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరని కోరుచున్నాను.

ఏలేటి దుర్గా భవాని
W/o. వీరబాబు, డోర్ నెం. 21-97,
హరిజనపేట, గూడపర్తి
వేట్లపాలెం - 533434, సామర్లకోట మండలం
కాకినాడ జిల్లా, సెల్: 8790797623

దస్తావేజులు పోయినవి

తూర్పుగోదావరి జిల్లా, అనపర్తి మండలం, అనపర్తి గ్రామం, డోర్ నెం. 8-14 రు కాపురస్తులు కర్రి వెంకట కృష్ణారెడ్డి (లేటు) గారి భార్య కర్రి మణి అనే మహాలక్ష్మి అనువారికి రౌతులపూడి మండలం, ఎస్.అగ్రహారం పంచాయతీలో చేరిన బిళ్లవాక రెవెన్యూ గ్రామం తాలూకు సర్వే నెంబర్లు 59, 60-2, 64-1 మరియు 80 కి సంబంధించిన 15-65 1/2ట్లు సంబంధించిన దస్తావేజు నెంబర్లు 3470, 3471/ 3-12-2016 గా గల దఖలు దస్తావేజులు మరియు 39/23-7-2018 వీలునామా మరియు 3184/26-12-2001, 204/26-9-2001 క్రయ దస్తావేజులు తుని సబ్‌రిజిస్ట్రారు వారి ఆఫీసు వద్ద పోయినవి. ఈ దస్తావేజులు ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కి తెలియజేయగలరు.

కర్రి మణి అనే మహాలక్ష్మి
W/o. లేటు వెంకట కృష్ణారెడ్డి
అనపర్తి గ్రామం అనపర్తి మండలం
తూ॥గో॥జిల్లా, సెల్: 9849914685